ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన ఉపసర్పంచ్

❖ విద్యార్థులతో కలిసి భోజనం చేసిన గుండె వెంకన్న

దశ, బూర్గంపాడు : బూర్గంపాడు స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఉపసర్పంచ్ గుండె వెంకన్న పరిశీలించారు. పాఠశాలను సందర్శించిన ఆయన భోజనం నాణ్యత, వంటగది పరిసరాల పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న ఆహారంపై క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కూర్చొని భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా గుండె వెంకన్న మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. పాఠశాలలో ప్రతిరోజూ నిర్ణయించిన మెనూ ప్రకారం రుచికరమైన, పరిశుభ్రమైన, పౌష్టికాహారం అందించాలని ప్రధానోపాధ్యాయులు, వంట సిబ్బందికి సూచించారు. భోజనం తయారీలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన ఆయన పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, మంచినీటి వసతి, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, వసతి గృహ సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయులు లేదా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాఠశాలలో మిగిలి ఉన్న చిన్నపాటి సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని గుండె వెంకన్న హామీ ఇచ్చారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు

❖ కోవ లక్ష్మి వ్యక్తిగత విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలి: ఆత్రం సుగుణ

దశ, ఆసిఫాబాద్ : నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మానుకోవాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ హెచ్చరించారు. వ్యక్తిగత విమర్శలు, రాజకీయ కక్షలు పక్కనపెట్టి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, ఆ భారాన్ని మోస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆసిఫాబాద్‌కు రూ.10 కోట్ల పర్యాటక నిధులు ప్రకటిస్తే అభినందించాల్సింది పోయి వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. మహిళలకు కుట్టు మిషన్లు, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవడం వల్ల నష్టం ప్రజలకేనని అన్నారు. అభివృద్ధి పనులకు అడ్డుపడితే సమాధానం చెప్పేది కాంగ్రెస్ నాయకులు కాదని.. ఆసిఫాబాద్ ప్రజలేనని సుగుణ ఘాటుగా హెచ్చరించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేస్తుందంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. పెండింగ్ బిల్లులను సైతం తమ ప్రభుత్వం చెల్లిస్తూ అర్హులకు పథకాల ప్రయోజనం అందిస్తోందని స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులను ఆమె డిమాండ్ చేశారు.

‘నామా’ని మర్యాదపూర్వకంగా కలిసిన ‘తాటి’

దశ, అశ్వారావుపేట: కొత్తగూడెం పర్యటనకు విచ్చేసిన ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నామా నాగేశ్వరరావుని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగూడెంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో పలు రాజకీయ అంశాలపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులు, రాజకీయ పరిణామాలు తదితర అంశాలపై నాయకులు చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసాని చంద్రమోహన్, డా. భూక్యా ప్రసాద్, జుజ్జురి శ్రీరామమూర్తి, సుర వెంకటేశ్వర్లు, కూరమ సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నం రామకృష్ణ, గుడవర్తి వెంకటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ నరుకుల్ల సత్యనారాయణ, వేముల హరీష్, వంకాయలపాటి బాబురావు, హన్మంత్ రావు, గాదె లింగయ్య, సత్తి నాగేశ్వరరావు, పూనెం సమ్మయ్య, వాసు, రణ్యా నాయక్, మిట్ల నర్సింహారావు, సంకా కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

75% రిజర్వేషన్ పునరుద్ధరించాల్సిందే!

❖ ఆదివాసీ హక్కులను కాలరాస్తే ఊరుకోం: తుడుందెబ్బ

దశ, ఆసిఫాబాద్ : పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ నిరుద్యోగులకు 75 శాతం స్థానిక రిజర్వేషన్‌ను తొలగించడాన్ని నిరసిస్తూ ఆదివాసీ తుడుందెబ్బ పిలుపునిచ్చిన ఏజెన్సీ బంద్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సంపూర్ణంగా, ప్రశాంతంగా ముగిసింది. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఆర్టీసీ డిపో వద్ద భారీ ధర్నా నిర్వహించి ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బంద్‌కు వ్యాపార సంస్థలు, మార్కెట్లు, ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపాయి. 75% స్థానిక రిజర్వేషన్‌ను వెంటనే పునరుద్ధరించాలని, జీవో3తో పాటు 1/70, పీసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని తుడుందెబ్బ నాయకులు హెచ్చరించారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలి

❖ ముక్కెర రాజు డిమాండ్
❖ హుజూరాబాద్‌లో 4వ రోజుకు చేరిన జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలు
❖ దీక్షా శిబిరానికి టీజేఎస్ రాష్ట్ర నేత, న్యాయవాది ముక్కెర రాజు సంపూర్ణ మద్దతు..

దశ, హుజూరాబాద్: నిత్యం ప్రజల సమస్యలపై గళమెత్తే జర్నలిస్టులు తమ న్యాయమైన హక్కుల కోసం నేడు రోడ్డెక్కి నిరసన తెలపాల్సి రావడం అత్యంత బాధాకరమని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది ముక్కెర రాజు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమ ఆకాంక్షను ప్రజల్లోకి తీసుకెళ్లిన చరిత్ర జర్నలిస్టులదని, అలాంటి వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

హుజూరాబాద్ పట్టణంలో జర్నలిస్టుల నివేశన స్థలాలపైకాంగ్రెస్‌నాయకుడుగూడూరుస్వామిరెడ్డి కోర్టులో కేసు వేయడాన్ని నిరసిస్తూ హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాల్గవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన ముక్కెర రాజు మాట్లాడుతూ పలు కీలక అంశాలను ప్రస్తావించారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి...

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మిస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ కుల సంఘాలకు స్థలాలు కేటాయించినప్పుడు లేని అభ్యంతరాలు, సమాజం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టుల విషయంలోనే ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. జర్నలిస్టుల స్థలాలపై కోర్టులో ఉన్న కేసుల విషయంలో రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వీడి, పటిష్టమైన కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసి ఆ కేసులు త్వరగా వీగిపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

ఇప్పటికే అన్ని అనుమతులు, ఇంటి నంబర్లు, విద్యుత్ కనెక్షన్లు పొంది తాత్కాలిక ఇల్లు నిర్మించుకున్న జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. జర్నలిస్టుల సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తమ పార్టీ, తాము అండగా ఉంటామని, అవసరమైతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి, జర్నలిస్టులు,జేఏసీ నాయకులు వేల్పుల రత్నం,బీసీ జేఏసీ నాయకులు చందుపట్ల జనార్ధన్, ముదిరాజ్ సంఘం నాయకులు కొలిపాక సమ్మయ్య, ప్రొఫెసర్ శేఖర్, పాల్గొన్నారు.

సినీ పక్కిలో నిలిపి ఉన్న ఆటోలోంచి రెండు లక్షలు చోరీ..

దశ, హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారిలోని ఇండియన్ బ్యాంకు ఎదురుగా నిలిపి ఉన్న టాటా ఏసీ ఆటోలోని రెండు లక్షల నగదును గుర్తు తెలియని దొంగలు ద్విచక్ర వాహనంపై వచ్చి కళ్ళు మూసి తెరిచేలోగా సినీ పక్కిలో దొంగిలించడం పలువురిని విస్మయానికి గురిచేసింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయికల్ కు చెందిన గుంపుల సంతోష్ యాదవ్ వరంగల్ రోడ్ లోని ఇండియన్ బ్యాంక్ ఎటిఎం లో రెండు లక్షల రూపాయలు విత్ డ్రా చేసి టాటా ఏసీ ఆటోలో పెట్టి గ్లాసుల ఎక్కించి టీ తాగుతుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఒకరు బండిపై ఉండగా మరొకరు టాటా ఏసీ వద్దకు వెళ్లి గ్లాసులు పగలగొట్టి అందులో పెట్టిన రెండు లక్షల నగదును తీసుకొని ఇద్దరు కలిసి బైక్ పై పరారయ్యారు.

బాధితుడు టీ తాగి వచ్చి చూసి సరికి ఆటోలో ఉంచిన డబ్బులు కనిపించకపోవడంతో ఎదురుగా బ్యాంకు సిసి ఫుటేజ్ పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి డబ్బులు దొంగిలించి తీసుకువెళ్లడం స్పష్టంగా రికార్డు అయింది. వెంటనే వందకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా హుజురాబాద్ ఖూకోట్ పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి సిసి ఫుటేజ్ ను సేకరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దొంగల కోసం సిసి ఫుటేజ్ లు సేకరించే పనులు పడ్డారు. ఏది ఏమైనా మిట్ట మధ్యాహ్నం ఇద్దరు దొంగలు ద్విచక్ర వాహనంపై వచ్చి రెండు లక్షల నగదును దొంగలించడం పట్టణంలో సంచలనం కలిగించింది.

వైశాలి గార్డెన్స్‌లో అభివృద్ధి, భద్రతపై పరిశీలన

దశ, ఓయూ: వైశాలి గార్డెన్స్ వాసుల విజ్ఞప్తి మేరకు అక్కడి ప్లేగ్రౌండ్‌ను పరిశీలించి అభివృద్ధికి అవసరమైన మార్పులు, కొత్త పరికరాల ఏర్పాటుపై పరిశీలన బీ ఆర్ ఎస్ నాయకురాలు సుస్మిత.ఈ సందర్భంగా వేణు ఆహ్వానించి ఆటస్థలాన్ని పరిశీలించారు. ఎన్. కోటేశ్వర్‌రావు తదితర కాలనీ వాసులతో కలిసి పరిసర ప్రాంతాల్లో పర్యటించి రహదారి భద్రతపై చర్చించారు. ఇటీవల ఈ ప్రాంతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని కొత్త స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొన్నారు. కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించడంతో పాటు మెరుగైన ప్లేగ్రౌండ్ సౌకర్యాలు, సురక్షితమైన పరిసరాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు.

బెల్ట్ షాపులు మూసివేయాల్సిందే.. వెల్లంకిలో గ్రామసభ తీర్మానం

దశ, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలను నిషేధించాలని గ్రామ ప్రజలు, పంచాయతీ పాలకవర్గం, అఖిలపక్ష నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామ సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నారు.

గ్రామంలో బెల్ట్ షాపుల కారణంగా యువత భవిష్యత్తు, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని కోరుతూ కలెక్టర్, జిల్లా ఎక్సైజ్ అధికారులు, మండల ఎక్సైజ్ అధికారులు, రామన్నపేట సీఐ, ఎస్ఐలకు వినతిపత్రాలు అందజేశారు. సెప్టెంబర్ 1 నుంచి గ్రామ పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ, ప్రజలు, అఖిలపక్ష నాయకులు స్పష్టం చేశారు. గ్రామంలో మద్యం విక్రయాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సంధ్య లింగయ్య, జువ్వగోని మల్లమ్మ, జింక శాంతి, మొగిలి భాగ్యలక్ష్మి, గంజి భాస్కర్, కన్నెబోయిన రాజలింగంతో పాటు అఖిలపక్ష నాయకులు పర్నే వెంకట్‌రెడ్డి, ఆవనగంటి నగేష్, పున్న వెంకటేశం, కర్రె సంతోష్, బర్ల బాబురావు, నకిరేకంటి మహేష్, తాటిపాముల లింగస్వామి, గూని రాజు, గూడెల్లి దామోదర్, నకిరేకంటి నరేందర్, పాశం సతీష్, నకిరేకంటి గణేష్, గుర్రం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి పెట్రోలింగ్ పెంచాలి

దశ, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని గ్రామాల్లో రాత్రి వేళ మద్యం సేవిస్తూ బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడుతున్న యువకులపై నిఘా పెంచాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షుడు కల్లెం ఉపేందర్ కోరారు. ఈ మేరకు రామన్నపేట సీఐకి వినతిపత్రం అందజేశారు. రాత్రి 9 గంటల తర్వాత పలుచోట్ల యువకులు గుంపులుగా చేరి మద్యం సేవిస్తున్నారని, దీంతో మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని ఉపేందర్ తెలిపారు. ఇలాంటి పరిస్థితులు గ్రామాల్లో గొడవలు, ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని, విద్యార్థులపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి పత్రం అందజేత

దశ, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన బాలరాజు, రామన్నపేట పట్టణానికి చెందిన చెరుకు సత్యనారాయణ గతంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేశారు. 2006 నుంచి 2019 వరకు విధులు నిర్వహించిన తమను జాబ్‌కార్డుల్లో పనిదినాలు 10 శాతానికి తగ్గిన కారణంగా విధుల నుంచి తొలగించినట్లు వారు తెలిపారు, ప్రస్తుతం వీబీజీ రామ్‌జీ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా తిరిగి పనిచేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు, ఈ మేరకు బుధవారం రామన్నపేట ఎంపీడీవో ఏ. రాములు, ఏపీవో వెంకన్నకు వినతిపత్రం అందజేశారు,గతంలో సుమారు 13 సంవత్సరాల పాటు అందించిన సేవలు, తమకు ఉన్న అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు అధికారులను విజ్ఞప్తి చేశారు, ఉపాధి హామీ పథకం అమలులో తమ అనుభవాన్ని వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా వినతిపత్రం ద్వారా కోరారు.